# కృష్ణా జలాల్లో నీటి వాటాపై కొట్లాడుతా

- సాగర్ ఆయకట్టును ఎండబెట్టే కుట్రలో కాంగ్రెస్, బీజేపీ
- కాంగ్రెస్‌కు ఓట్లేసిన ప్రజలు పునరాలోచన చేస్తున్నరు
- వ్యవసాయం, పారిశ్రామిక అభివృద్ధిపై ప్రత్యేక ప్రణాళిక
- బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బస్సుయాత్రకు అనూహ్య స్పందన
- నల్లగొండ గడ్డపై గులాబీ జెండా ఎగురేస్తాం
- బీఆర్ఎస్ నల్లగొండ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి

నమస్తే తెలంగాణ ప్రత్యేక ఇంటర్వ్యూ



నల్లగొండ ప్రతినిధి, మే 1 (నమస్తే తెలంగాణ): 'కృష్ణానదీ జలాల్లో రాష్ట్రాల మధ్య నీటి వాటా తేల్చకముందే ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పజెప్పేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్రలు చేస్తున్నాయి. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నన్నాళ్లు ఈ కుట్రలను తిప్పికొట్టారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందో.. లేదో వెంటనే నాగార్జునసాగర్ ప్రాజెక్టును కేఆర్ఎంబీకి వదిలేసింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న ప్రాజెక్టు నిర్వహణ అధికారం కోల్పోయినట్టైంది. కృష్ణాజలాల్లో రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయంపై ప్రశ్నిస్తూ సాగర్ ఆయకట్టు ప్రయోజనాలను సంరక్షించేందుకు పార్లమెంట్‌లో గళమెత్తుతా' అని బీఆర్ఎస్ నల్లగొండ లోక్‌సభ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి అన్నారు. నల్లగొండ గడ్డపై ఈసారి గులాబీ జెండా ఎగురవేస్తా అంటున్న కంచర్ల కృష్ణారెడ్డితో 'నమస్తే తెలంగాణ' ప్రత్యేక ఇంటర్వ్యూ..

**ఎన్నికల్లో మీ ప్రధాన ఎజెండా?**

నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గం మెజార్టీ భాగం వ్యవసాయ ఆధారితమే. గోదావరి, కృష్ణాజలాలపై ఆధారపడే సాగు చేస్తుంటారు. సమైక్య రాష్ట్రంలో సాగర్ ప్రాజెక్టును గాలికొదిలేశారు. కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక మన నీళ్లను మనం వాడుకున్నాం. బీఆర్ఎస్ పాలనలో 18 పంటలకు సమృద్ధిగా సాగర్ నీళ్లు పారినయ్. కాంగ్రెస్ వచ్చింది.. నీళ్లు పోయినయ్. యాసంగికి నీళ్లిచ్చే అవకాశం ఉన్నా మనసు రాలే. కేఆర్ఎంబీ పేరు చెప్పి తప్పించుకున్నరు. మొత్తం 3లక్షల ఎకరాల్లో పండలెండినయ్. రైతులు కన్నీళ్లు పెట్టుకున్నరు. అందుకే కృష్ణాజలాల్లో బచావత్ ట్రిబ్యునల్ ప్రకారం నీటి వాటా తేల్చాలి. సాగర్ ప్రాజెక్టుపై రాష్ట్రానికే హక్కులు ఉండాలంటే ఇక్కడ బీఆర్ఎస్ గెలువాలి.

**తొలిసారి పోటీ.. ప్రచారం ఎలా ఉంది?**

పార్టీపై నాకు ఉన్న నిబద్ధత, నాయకత్వంపై ఉన్న విధేయతతోనే టికెట్ వచ్చిందని భావిస్తున్న. ఎన్నికల్లో పోటీ తొలిసారే అయినా పలు ఎన్నికల్లో ఇన్‌చార్జిగా పనిచేసిన అనుభవం ఉంది. మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి ఆధ్వర్యంలో విస్తృతంగా ప్రచారం చేస్తున్నం. పార్టీ ముఖ్యుల నుంచి కార్యకర్తల వరకు అందరి సహకారం ఉన్నది. ప్రజల్లో మంచి స్పందన వస్తున్నది.

**కేసీఆర్ రోడ్‌షోల తర్వాత పరిస్థితి ఏంటి?**

మిర్యాలగూడ, సూర్యాపేట రోడ్‌షోల్లో కేసీఆర్ పాల్గొన్నారు. రెండు చోట్లా కేసీఆర్ కోసం వేలాది మంది తరలివచ్చారు. 1956 నుంచి నేటి వరకు సాగర్ ఆయకట్టుకు, మనకు కాంగ్రెస్సే శత్రువు అన్న కేసీఆర్ మాట ప్రజల్లోకి విస్తృతంగా వెళ్లింది. సూర్యాపేటలో కాళేశ్వరం ఫలాలు చెప్పడం ఆకట్టుకున్నది. కేసీఆర్ ప్రసంగంతో అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓట్లేసిన ప్రజలు పునరాలోచనలో పడ్డారు. బీఆర్ఎస్‌ను ఆదరించేందుకు సిద్ధంగా ఉన్నారు.

**బీఆర్ఎస్‌కు ఎందుకు ఓటెయాలి ?**

రాష్ట్రానికి మేలు జరుగాలంటే బీఆర్ఎస్ గెలవాలి.. నిలవాలని మేము చెప్తున్నం. కాంగ్రెస్, బీజేపీ పాలనను ప్రజలు చూశారు. రాష్ట్రానికి చేసిందేమిటో చెప్పే పరిస్థితి లేదు. మోదీ సర్కార్ ఒక్క జాతీయ ప్రాజెక్టునూ ఇవ్వలేదు. బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం హక్కుల కోసం కొట్లాడిన తీరు ప్రజల కండ్ల ముందుంది. రాష్ట్ర ప్రయోజనాలు, ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కేసీఆర్ పాలించారు. అందుకే ఎన్నో రంగాల్లో రాష్ట్రం టాప్‌గా నిలిచింది. ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఓటేసి గెలిపిస్తే రాష్ట్రం కోసం కొట్లాడే సత్తా కేసీఆర్‌కే ఉందని ప్రజలకు చెప్తున్నం.

**రేవంత్‌రెడ్డి చెప్పినట్టుగా ఎంపీ ఎన్నికలు కాంగ్రెస్ పాలనకు రెఫరెండమేనా ?**

140 రోజుల కాంగ్రెస్ పాలన చూశారు. ఆరు గ్యారెంటీలు, 13 పథకాలు, 420హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చింది. డిసెంబర్ 9నే ఎన్నో పథకాలకు డెడ్‌లైన్‌గా చెప్పారు. కానీ ఫ్రీ బస్సు.. నో బస్సు పథకం తప్ప మిగిలిన పథకాలేవీ ఆచరణకు రాలే. ఇప్పుడేమో ఓట్ల కోసం దేవుళ్లపై ఒట్లు వేస్తున్నరు. అందుకే ప్రజలు ఆలోచనలో పడ్డారు. కాంగ్రెస్ మోసాలపై కర్రు కాల్చి వాత పెట్టడం ఖాయం అనిపిస్తున్నది. ఈ ఎన్నికలు కచ్చితంగా రెఫరెండమే.

**ప్రధాన పార్టీల అభ్యర్థుల బలాలు, బలహీనతలేమిటి?**

నేను పేదింటి రైతుబిడ్డను. సొంతూరిలో ప్రజల మధ్యనే పెరిగాను. ప్రజల అవసరాలు, రైతుల ఆకాంక్షలు, యువత ఆశలు.. అన్ని వర్గాలను దగ్గరగా చూసిన. 35 ఏండ్ల నుంచి రాజకీయాల్లో ఉన్న. పట్టుదలతో పనిచేసే నిబద్ధత ఉంది. కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులకు ఉన్న అర్హతలేంటో ప్రజలు ఆలోచించాలి. తండ్రి జానారెడ్డి వారసత్వమే కాంగ్రెస్ అభ్యర్థి ఏకైక బలం. పదవి వ్యామోహం తప్ప.. ప్రజా సమస్యలపై అవగాహన ఎక్కడిది? తమ్ముడు ఎమ్మెల్యే అయిండు.. నేను ఎంపీ కావాలన్నదే ఆలోచన. ఇక బీజేపీకి అభ్యర్థి దొరకక బీఆర్ఎస్ నుంచి చేర్చుకుని టికెట్ ఇచ్చారు. ఇక్కడ వాళ్ల ప్రభావం నామమాత్రమే.

### ఎంపీగా గెలిస్తే నల్లగొండకు ఏం చేస్తారు?

స్థానికంగా ఉంటూ నల్లగొండ లోక్‌సభ పరిధిలో పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తా. విద్య, వైద్య రంగాల్లో మరిన్ని సదుపాయాలపై ప్రత్యేక దృష్టి పెడతా. కృష్ణాజలాల్లో నీటి వాటా కోసం కొట్లాడుతా. సాగర్ ఆయకట్టు ప్రయోజనాలను కాపాడుతా. సాగునీటి ప్రాజెక్టుల పూర్తి కోసం పనిచేస్తా. వరి, పత్తి పంటలకు మద్దతు ధర కోసం కొట్లాడుతా. పారిశ్రామిక అభివృద్ధి, ఉపాధి అవకాశాలను మెరుగుపరుస్తా. నల్లగొండ – దేవరకొండ రహదారి విస్తరణ పనులు, బీబీనగర్ – నడికుడి రైల్వే డబ్లింగ్ పనులు, కొత్త రైల్వేలైన్ కోసం ప్రయత్నిస్తా. రాష్ట్ర హక్కుల కోసం తోటి ఎంపీలతో కలిసి పోరాడుతాను.



కొల్లాపూర్ మండలం ఎల్లూరు శివారులో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

## బుద్ధొచ్చింది.. కాంగ్రెస్‌కు ఓటెయ్యం!

- మొన్న ఆ పార్టీకి ఓటేసి మోసపోయినం
- ఇచ్చిన గ్యారెంటీలు అమలుచేయక ప్రజలను గోసపెడుతున్నరు
- కారు గుర్తుకే ఓటేస్తాం.. మా మదిలో కేసీఆర్ సారే
- స్పష్టం చేసిన ఉపాధి హామీ కూలీలు
- ఎల్లూరు శివారులో మాజీ ఎమ్మెల్యే బీరంతో మాటముచ్చట

కొల్లాపూర్ రూరల్, మే 1: 'అసెంబ్లీ ఎన్నిలకు ముందు కాంగ్రెస్ నేతలు చెప్పిన మాయమాటలు విని వారికి ఓటేసి గెలిపిస్తే మమ్మల్ని ఆగం చేసిండ్రు.. ఇచ్చిన గ్యారెంటీలు అమలు చేయకపోవడంతో ఇప్పుడు గోసపడుతున్నం.. ఎంపీ ఎన్నికలు వస్తుండటంతో మళ్లా ఆ పార్టోళ్లు అసత్య ప్రచారాలు.. మాయమాటలు చెప్పేందుకు వస్తున్నరు. మరోసారి వారి మాటలకు మోసపోం.. మాకు బుద్ధి వచ్చింది.. మా గుండెల్లో కేసీఆర్ సారే ఉన్నడు' అని మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డితో ఉపాధి హామీ కూలీలు కాంగ్రెస్‌పై ఉన్న అక్కసును వెళ్లగక్కారు. బుధవారం ఆయన నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం అంజనగిరికి ఎన్నికల ప్రచారానికి వెళ్లి వస్తుండగా.. ఎల్లూరు శివారులో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు కనిపించారు. వెంటనే కారు దిగిన బీరం హర్షవర్ధన్‌రెడ్డి వారి వద్దకు వెళ్లి పలుకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇంత మోసం చేసిన కాంగ్రెస్ లీడర్లు మళ్లీ తమ ఇండ్ల వద్దకు ఓట్ల కోసం వచ్చినా ఆ పార్టీకి ఓట్లేసే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పార్టీకే ఓటేస్తామని, ప్రవీణ్ సారును గెలిపించుకుంటామని వెల్లడించారు. ఈ సందర్భంగా బీరం మాట్లాడుతూ.. నాగర్‌కర్నూల్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ప్రజా సేవ కోసం ఐపీఎస్ ఉద్యోగానికి రాజీనామా చేసి వచ్చారని, కారు గుర్తుకు ఓట్లేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.



ఆదిలాబాద్ ఎన్నికల ప్రచారంలో వృద్ధుడితో మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న

## కాంగ్రెస్ పింఛన్‌పై నమ్మకం లేదు

- ఈసారి బీఆర్ఎస్‌కే ఓటేస్తా
- జోగు రామన్న ప్రచారంలో వృద్ధుడు

ఆదిలాబాద్, మే 1(నమస్తే తెలంగాణ): అసెంబ్లీ ఎన్నికల్లో ఆరు గ్యారెంటీల పేరిట ఓట్లు దండుకున్న కాంగ్రెస్ పార్టీ మోసం చేస్తున్నదని ప్రజలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం మాజీ మంత్రి జోగు రామన్న ఆదిలాబాద్ పట్టణంలో పర్యటించారు. ఈ సందర్భంగా.. డీసీసీబీ బ్యాంకు వద్ద కొండిబా అనే వృద్ధుడిని కలిసి బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని కోరారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం రూ.200, రూ.500 పింఛన్ ఇచ్చిందని, బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత తనకు రూ.2 వేల పింఛన్ వస్తున్నదని వృద్ధుడు తెలిపాడు. కాంగ్రెస్ పార్టీ రూ.4 వేల పింఛన్ ఇస్తానన్న హామీ ఇంతవరకు అమలు కాలేదని, వస్తుందనే నమ్మకం లేదని కొండిబా పేర్కొన్నాడు. తనకు రూ.2 వేల పింఛన్ ఇచ్చిన బీఆర్ఎస్‌కే ఓటు వేస్తానని హామీ ఇచ్చాడు.

## కోమటిరెడ్డీ.. మరి తుమ్మలనూ కొడ్తవా?

- రైతుబంధు రాలేదన్న వారిని చెప్పుతో కొట్టాలన్నావ్ కదా?
- మంత్రి కోమటిరెడ్డికి మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి ప్రశ్న



నల్లగొండ ప్రతినిధి, మే 1 (నమస్తే తెలంగాణ) : రైతుబంధు రాలేదన్న వారిని చెప్పుతో కొట్టాలన్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఇప్పుడు మంత్రి తుమ్మలను కొట్టేందుకు సిద్ధమేనా? అని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి ప్రశ్నించారు. రైతుబంధు రాలేదని స్వయంగా మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్న విషయాన్ని ప్రస్తావిస్తూ.. 'నువ్వు ఖమ్మం వెళ్లి కొడతావో? లేదా తుమ్మల వచ్చి నల్లగొండలో నిన్ను కొట్టాలో? తేల్చుకోవాలని సవాల్ విసిరారు. లేదంటే ఇద్దరిని కలిపి అవే చెప్పులతో కొట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. బుధవారం నల్లగొండలోని బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో జగదీశ్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీపై తిరుగుబాటుకు సిద్ధమయ్యారని, అందుకే ఆ పార్టీ నేతలు ఓటమి భయంతో దాడులు, దౌర్జన్యాలు, పార్టీ ఫిరాయింపులకు తెరలేపారని విమర్శించారు. కేసీఆర్ రోడ్‌షోలకు ప్రజలు బ్రహ్మరథం పడుతుండటంతో కాంగ్రెస్ నేతలకు పిచ్చిలేస్తున్నదని తెలిపారు.

## కేసీఆర్ ఆనవాళ్లు చెరిపేయడం
# రేవంత్ జేజమ్మ తరం కాదు

ఆయన మాజీ బాస్‌తో కలిసి తెలంగాణే లేకుండా చేస్తే తప్ప అసాధ్యం

- సెస్ రూపంలో బీజేపీ సర్కారు రూ.30 లక్షల కోట్లు వసూలు చేసింది
- అదానీ, అంబానీ సహా కార్పొరేట్లకు రూ.14.50 లక్షల కోట్ల రుణం మాఫీ..
- తప్పని నిరూపిస్తే ఎమ్మెల్యే పదవికి రిజైన్
- కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కి సవాల్
- 10-12 ఎంపీ సీట్లు వస్తే ఏడాదిలోపు రాష్ట్రాన్ని శాసించే స్థాయికి కేసీఆర్
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- తెలంగాణభవన్‌లో ఘనంగా మే డే



తెలంగాణభవన్‌లో ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా జెండాను ఎగురవేస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. చిత్రంలో పార్టీ ఎంపీ అభ్యర్థి పద్మారావుగౌడ్ తదితరులు

హైదరాబాద్, మే 1 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో కేసీఆర్ అనవాళ్లు లేకుండా చేయడం రేవంత్‌రెడ్డే కాదు.. ఆయన జేజమ్మ తరం కూడా కాదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారక రామారావు అన్నారు. బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు యాదవ్ అధ్యక్షతన తెలంగాణ భవన్‌లో మే డేను బుధవారం ఘనంగా నిర్వహించగా కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టు, సచివాలయం, 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం, యాదాద్రి ఆలయాన్ని కేసీఆర్ కట్టించారని, ఒకవేళ కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేయాలంటే వీటన్నింటినీ కూల్చాల్సి ఉంటుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఆయన మాజీ బాస్ కలిసి మళ్లీ రెండు రాష్ట్రాలను కలిపి అసలు తెలంగాణనే లేకుండా చేస్తే తప్ప కేసీఆర్ ఆనవాళ్లను చెరిపేయడం అసాధ్యమని స్పష్టం చేశారు. తెలంగాణ అంటేనే కేసీఆర్ అన్నది గుర్తుంచుకోవాలని సూచించారు.

**ఉద్యమంలో కార్మికుల పాత్ర మరువలేనిది**

తెలంగాణ ఉద్యమంలో కార్మికుల పాత్ర మరవలేనిదని కేటీఆర్ కొనియాడారు. ఉద్యమ సమ యం.. సకల జనుల సమ్మెలో సింగరేణి, ఆర్టీసీ, విద్యుత్ కార్మికులు, న్యాయవాదులు అగ్రభాగాన ఉన్నారని చెప్పారు. ఉద్యమంలో కేసీఆర్ బొంబాయి, దుబాయ్, బొగ్గుబాయి అని కార్మికులను ఉద్దేశించే అన్నారని గుర్తుచేశారు. కార్మికుల విషయంలో కేసీఆర్ ఎంతో గౌరవంగా ఉంటారని, కరోనా సమయంలో కార్మికులు తమ స్వస్థలాలకు వెళ్లేందుకు ఎన్ని ఇబ్బందులు పడ్డారో మరిచిపోవద్దన్నారు. కార్మికులను చావ గొట్టింది ఇదే మోదీ అని, కార్మికుల కోసం రైళ్లు వేయాలంటే మానవత్వం లేకుండా వ్యవహరించారని చెప్పారు. మోదీ కారణంగానే మనం బతికి ఉన్నామని బీజేపీ నేత అంటుంటారని, మోదీయే కరోనా వ్యాక్సిన్ కనుగొన్నాడని కిషన్‌రెడ్డి అంటాడని కేటీఆర్ ఎద్దేవా చేశారు. మోదీ దేవుడని ఇంకొకడు అంటాడని, మోదీ దేనికి దేవుడని ప్రశ్నించారు. కార్మికులు, కర్షకులను చావగొట్టినందుకు మోదీ దేవుడా అని నిలదీశారు.

**పెట్రో ధరలు ఎందుకు పెరిగినయ్?**

ప్రపంచ వ్యాప్తంగా 2014లో ముడిచమురు బ్యారెల్ ధర 100 డాలర్లు ఉండేదని, ప్రస్తుతం 84 డాలర్లకు తగ్గినా పెట్రోల్, డిజిల్ ధరలు ఎందుకు పెరిగాయని కేటీఆర్ ప్రశ్నించారు. రాష్ట్రాలకు పన్నుల వాటా ఇవ్వకుండా ప్రధాని మోదీ ప్రత్యేక సెస్‌లు విధించి, సెస్‌ల పేరుతో రూ.30 లక్షల కోట్లకు పైగా ప్రజల నుంచి వసూలు చేశారని, ఆ మొత్తంలో రూ.14.50 లక్షల కోట్ల మేరకు అదానీ, అంబానీ సహా కార్పొరేట్ల రుణం మాఫీ చేసేందుకు వాడుకున్నారని, కాకులను కొట్టి గద్దలకు పెట్టారని విమర్శించారు. ఈ విషయం తప్పని బీజేపీ నేతలు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ నిరూపిస్తే తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని కేటీఆర్ సవాల్ చేశారు. ఇదే మోదీ ఉచితాలు ఇస్తే అనుచితం అంటాడని, బడా పారిశ్రామిక వేత్తలకు మాత్రం అప్పనంగా లక్షల కోట్ల రుణమాఫీ చేస్తాడని దుయ్యబట్టారు. రైతులకు ఉచిత విద్యుత్ ఇస్తామంటే వద్దు అంటాడని, దేశంలో రైతులకు ఉచిత విద్యుత్ ఇస్తే రూ.1.50 లక్షల కోట్లు అవుతుందని, కార్పొరేట్లకు మాఫీ చేసిన మొత్తంతో పదేండ్ల పాటు దేశమంతా రైతులకు ఉచిత విద్యుత్ ఇవ్వొచ్చని తెలిపారు. కార్మికుల కష్టాలు తెలుసు కాబట్టే కరోనా సమయంలో ఒక్కో కార్మికునికి రూ.500 చొప్పున ఇచ్చి, భోజనం పెట్టి ఉచిత రైళ్లు ఏర్పాటు చేసి ఇండ్లకు పంపించి కేసీఆర్ తన మంచితనాన్ని చాటుకున్నారని గుర్తుచేశారు.

**కార్మిక విభాగానికి అండగా ఉంటా**

పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వం వీఆర్ఏలు, పంచాయతీ సెక్రటరీలు, సెర్ప్ ఉద్యోగులు, హోంగార్డులు, సింగరేణి కార్మికులు, చేనేత, గీత కార్మికులకు ఎంతో మేలు చేసిందని, వారి జీతాలను భారీగా పెంచిందని, ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేసిందని గుర్తుచేశారు. కాంట్రాక్ట్ ఉద్యోగులకు కూడా 73 శాతం పీఆర్సీ అమలు చేసిందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా బీడీ కార్మికులను పింఛను ఇచ్చిందని చెప్పారు. రేవంత్ సర్కార్ కూడా వచ్చిన నాలుగు నెలల్లోనే చేనేత కార్మికులకు చీరెల ఆర్డర్లు బంద్ పెట్టిందన్నారు. సిరిసిల్లలో చేనేత కార్మికులు ఆత్మహత్యలు చేసుకునేలా చేశారని, ఫ్రీ బస్సు తప్పు కాదని, కానీ దాని ఆధారంగా ఉపాధి కోల్పోతున్న ఆటోడ్రైవర్లకు మేలు చేయాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక దాదాపు 50 మందికి పైగా ఆటో డ్రైవర్లు ఆత్మహత్య చేసుకున్నారని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. తాను ప్రాతినిధ్యం వహించే సిరిసిల్లనే కార్మికుల అడ్డా అని, కచ్చితంగా కార్మికులకు అండగా ఉంటానని, పార్టీ కార్మిక విభాగాన్ని తానే చూసుకుంటానని ప్రకటించారు. భవిష్యత్‌లో కార్మికులు, ఉద్యోగుల సమస్యలపై ఆందోళనలు, ఉద్యమాలు చేద్దామని పిలుపునిచ్చారు.

**బీఆర్ఎస్ ఎంపీలు ఎందుకు ఉండాలంటే..**

సింగరేణి ప్రైవేట్ పరం కావొద్దంటే, ప్రభుత్వ రంగ సంస్థలు అడ్డికి పావుషేరుకు అమ్ముకోవద్దంటే, హైదరాబాద్ కేంద్రపాలిత ప్రాంతం కావద్దంటే, రిజర్వేషన్లు, మైనార్టీలకు ఇచ్చిన రిజర్వేషన్లు రద్దు కాకుండా ఉండాలంటే, గోదావరి నీటిని కావేరికి మళ్లించకుండా అడ్డుకోవాలంటే పార్లమెంట్‌లో బీఆర్ఎస్ ఎంపీలు ఉండాలని కేటీఆర్ స్పష్టం చేశారు. ఇద్దరు ఎంపీలు ఉన్నప్పుడే తెలంగాణను సాధించామని, 10–12 ఎంపీ సీట్లు ఇస్తే మళ్లీ ఏడాది లోపల రాష్ట్ర రాజకీయాలను కేసీఆర్ శాసించే పరిస్థితి వస్తుందని చెప్పారు. కార్మికులు, ఆటో డ్రైవర్లు గట్టిగా అనుకుంటే 10–12 సీట్లు రావడం కష్టం కాదన్నారు. బీజేపీ గెలిస్తే సింగరేణి, నవ, మహారత్నాలు ఇలా అన్నింటినీ అమ్మేస్తుందని, అందుకే బీఆర్ఎస్ ఎంపీలు పార్లమెంట్‌లో ఉండాలన్నారు. కుల, మత, జాతి పేరిట కొట్లాడుకుంటే మన దేశం ముందుకుపోదని, వాటిని అడ్డం పెట్టుకొని రాజకీయాలు చేసే సన్నాసులకు, అరచేతిలో వైకుంఠం చూపిన ఛోటే భాయ్, పదేండ్లు మోసం చేసిన బడేభాయ్‌కి కచ్చితంగా బుద్ధి చెప్పాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కాలే యాదయ్య, మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఎం.శ్రీనివాస్ రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి రూప్ సింగ్, బీఆర్ఎస్ కార్మిక విభాగం రాష్ట్ర నాయకులు నారాయణ, మారయ్య, దానకర్ణాచారి, శ్రీనివాస్, శివశంకర్, ప్రభాకర్, బాబుమీయా పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌పై 25కు పైగా ఫిర్యాదులు

- బీఆర్ఎస్ కంప్లెయింట్లపై స్పందించని ఈసీ
- సీఎం రేవంత్ అసభ్య వ్యాఖ్యలపై అలక్ష్యం!
- కొందరు టార్గెట్‌గా చర్యలపై అనుమానాలు

హైదరాబాద్, మే 1 (నమస్తే తెలంగాణ): ఎన్నికల కోడ్ ఉల్లంఘనలో కాంగ్రెస్, ఆ పార్టీ నేతలపై తాము చేసే ఫిర్యాదులపై స్పందన ఉండటం లేదని బీఆర్ఎస్ వర్గాలు ఆరోపిస్తున్నాయి. మార్చి 16న ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు కాంగ్రెస్, టీపీసీసీ చీఫ్, సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ దాదాపు 25 ఫిర్యాదులు చేసినా ఈసీ నుంచి స్పందన లేదని విమర్శిస్తున్నాయి. సభల్లో సీఎం రేవంత్ రైతు రుణమాఫీ అంశంలో దేవుళ్లపై ప్రమాణం చేస్తూ ఓటర్లను మభ్యపెడుతున్నారని, కేసీఆర్, కేటీఆర్‌పై అభ్యంతరకర వ్యాఖ్యలు చేస్తున్నారని, రాహుల్‌గాంధీ, మంత్రులు కొండా సురేఖ, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మంత్రి జూపల్లి కృష్ణారావు వ్యాఖ్యలపైనా కంప్లయింట్ చేసినట్టు వివరించారు. ఇలా 45 రోజులుగా ఫిర్యాదుల చేస్తున్నా ఈసీ నుంచి స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని పార్టీల పట్ల ఈసీ ఒకే తీరుగా వ్యవహరించాల్సి ఉన్నా, అలా ఉండటం లేదని బీఆర్ఎస్ నాయకులు ఆరోపిస్తున్నారు. కాంగ్రెస్‌కు అనుకూలంగా వ్యవహరిస్తున్నదనే అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు.

## రేవంత్‌రెడ్డిపై ఈసీకి బీఆర్ఎస్ ఫిర్యాదు

- ఓయూ సెలవులంటూ ఫోర్జరీ లేఖను పోస్టు చేశారు
- సీఈవోకు ఎమ్మెల్యే వివేకానంద, సీనియర్ నేత సోమ వినతి

హైదరాబాద్, మే 1 (నమస్తే తెలంగాణ): ఓటర్లను తప్పుదోవ పట్టించే విధంగా ఫోర్జరీ లేఖను ట్విట్టర్‌లో పోస్ట్‌చేసిన సీఎం, పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది. బుధవారం బీఆర్‌కే ఆర్ భవన్‌లో సీఈవో వికాస్‌రాజ్‌ను కలిసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద, పార్టీ సీనియర్ నేత సోమ భరత్‌కుమార్ వినతిపత్రం అందజేశారు. 2023లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఉస్మానియా వర్సిటీ హాస్టళ్లకు కరెంటు కోత, నీటి సరఫరా లేని కారణంగా సెలవులు ఇస్తున్నామంటూ పేర్కొన్నట్టు సృష్టించిన ఫోర్జరీ లేఖను రేవంత్‌రెడ్డి తన ట్విట్టర్ ఖాతాలో పోస్ట్ చేశారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. వాస్తవంగా ఆయా కారణాలతో హాస్టళ్లను మూసివేస్తున్నట్టుగా వర్సిటీ అధికారులు ఆదేశాలను ఇవ్వలేదని, ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా ఫోర్జరీ లేఖ తయారు చేసి ట్విట్టర్‌లో రేవంత్‌రెడ్డి పోస్ట్ చేశారని తెలిపారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించి ఒక రాజకీయ పార్టీపై తప్పుడు ప్రచారం చేసే విధంగా వ్యవహరించిన రేవంత్‌రెడ్డిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ లబ్ధి పొందడానికి, ఉద్దేశపూర్వకంగానే బీఆర్ఎస్‌పై తప్పుడు లేఖలతో ప్రచారం చేస్తున్నట్టు పేర్కొన్నారు. ప్రజలను, ఓటర్లను, ఓయూ విద్యార్థులను అయోమయానికి గురిచేసే విధంగా కాంగ్రెస్ పార్టీ వ్యవహరిస్తుందని వివరించారు.


**ఓయూ పీఎస్‌లో రేవంత్‌పై బీఆర్ఎస్వీ ఫిర్యాదు**

ఉస్మానియా యూనివర్సిటీ, మే 1: నిరుడు ఓయూలో ఇచ్చిన సెలవుల సర్క్యులర్‌ను మార్ఫిడి చేసి సోషల్ మీడియాలో పోస్టు చేసిన సీఎం రేవంత్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో ఓయూ పోలీస్‌స్టేషన్‌లో విద్యార్థులు ఫిర్యాదు చేశారు. తొలుత రేవంత్‌రెడ్డి వైఖరికి నిరసనగా ఆర్ట్స్ కళాశాల ఆవరణలో విద్యార్థులు నిరసన తెలిపారు. బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చటారి దశరథ్ మాట్లాడుతూ.. ఫేక్ సర్క్యులర్‌ను సోషల్ మీడియాలో ఉంచిన రేవంత్‌పై కేసు నమోదు చేసి సమగ్ర విచారణ జరిపించాలని దశరథ్ డిమాండ్ చేశారు.



ఓయూ పోలీస్‌స్టేషన్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై ఫిర్యాదు చేస్తున్న బీఆర్ఎస్వీ నేతలు

### లోకం పోకడ





### ఎండా కాలం

| | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| నల్లగొండ | 46.6°c | 34.1°c |
| ఆదిలాబాద్ | 45.7°c | 26.2°c |
| నిజామాబాద్ | 44.1°c | 29.9°c |
| రంగారెడ్డి | 44.0°c | 23.4°c |
| మెదక్ | 43.9°c | 25.1°c |
| మహబూబ్‌నగర్ | 43.4°c | 31.2°c |
| హైదరాబాద్ | 43.0°c | 29.9°c |
| కరీంనగర్ | 43.0°c | 29.0°c |
| వరంగల్ | 43.0°c | 28.0°c |
| ఖమ్మం | 43.0°c | 27.0°c |

## 15 జిల్లాలకు రెడ్ అలర్ట్

మొదటిపేజీ తరువాయి...

మునగాల, నల్లగొండ జిల్లా చండూర్‌లో 46.5, నల్లగొండ జిల్లా తిమ్మాపూర్, ఖమ్మం జిల్లా వైరా, ఖానాపూర్, జగిత్యాల జిల్లా వెల్గటూర్, పెద్దపల్లి జిల్లా ముత్తారంలలో 46.4, మహబూబాబాద్ జిల్లా కొమ్ములవంచలో 46.3, జగిత్యాల జిల్లా జైనాలో 46.2, నల్గొండ జిల్లా మాడుగులపల్లిలో 46.2, అల్లీపూర్ (జగిత్యాల) 46.1, కొత్తగట్టు (కరీంనగర్ ) 46, కోల్వాయి (జగిత్యాల) 46, వీణవంక 46, వెల్గటూరు (జగిత్యాల) 45.9, తెల్దేవరపల్లె 45.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. పెరిగిన ఉష్ణోగ్రతల నేపథ్యంలో 15 జిల్లాలకు రెడ్‌అలర్ట్, 18 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్‌ను వాతావరణశాఖ జారీ చేసింది. ములుగు, భద్రాద్రి–కొత్తగూడెం, నల్లగొండ, ఖమ్మం, సూర్యాపేట, హనుమకొండ, మహబూబాబాద్, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లోని పలుచోట్ల ఈనెల 6వ తేదీ వరకు తీవ్ర వడగాల్పులకు అవకాశం ఉందని హెచ్చరించింది. ఈ మేరకు ఆయా జిల్లాల కలెక్టర్లు తగిన చర్యలు తీసుకోవాలని సూచించింది.

### వడదెబ్బకు ఐదుగురు మృతి

- ఎన్నికల శిక్షణకు వెళ్లి వస్తూ టీచర్
- మేడే రోజునే ఆటో కార్మికుడు..
- ఉపాధి పనులకు వెళ్లిన కూలీ
- ఫుట్‌పాత్‌పై గుర్తు తెలియని ఇద్దరు

బషీరాబాద్ / బోథ్/తిమ్మాపూర్/ మియాపూర్/ కాచిగూడ,మే 1: వడదెబ్బతో బుధవారం ఐదుగురు మృతి చెందారు. వికారాబాద్ జిల్లాలోని బషీరాబాద్ తండా ప్రభుత్వ టీచర్ రాణి(45)తాండూరులో ఎన్నికల శిక్షణకు హాజరై ఇంటికి వెళ్తుండగా తాండూరు బస్టాండ్‌లోనే కుప్పకూలింది. స్థానికులు జిల్లా దవాఖానకు తరలించగా పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారు. ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలంలోని పరుపుల పల్లెకు చెందిన ఆత్రం జంగు(46) ఉపాధి పనులకు వెళ్లి ఇంటికి వచ్చి కిందపడి మృతిచెందాడు. హైదరాబాద్‌లోని మియాపూర్‌లోని మీసేవ సమీపంలోని ఫుట్‌పాత్‌పై గుర్తు తెలియని వ్యక్తి (45), కాచిగూడ రైల్వేస్టేషన్ పార్కింగ్ ఫుట్‌పాత్‌పై గుర్తుతెలియని వృద్ధురాలు(65) వడదెబ్బతో బుధవారం మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. కార్మిక దినోత్సవం నాడే ఓ ఆటో డ్రైవర్ ఆర్ నర్సయ్య(46) వడదెబ్బబారిన పడి కన్నుమూశాడు. ఈ ఘటన కరీంనగర్ జిల్లా నుస్తులాపూర్‌లో బుధవారం జరిగింది.